సాక్షి చిత్తూరు

ఆదివారం। 26। జనవరి। 2025



'గణ'తంత్ర 'ముస్తాబు'

చిత్తూరులో ఆదివారం జరగనున్న గణతంత్ర వేడుకలకు జిల్లా పోలీసు శిక్షణ కేంద్రాన్ని ఘనంగా ముస్తాబు చేశారు. - IIలో



ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటే కీలకం

ప్రజాస్వాయ్య పరిరక్షణలో ఓటే కీలకం అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావ్ అన్నారు. - IIలో



పంటలపై ఏనుగుల దాడి

బోడబండ్ల ఫారెస్ట్ బీట్ పరిధిలోని అటవీ శివారు గ్రామాల్లో పంటలపై ఏనుగులు వరుస దాడులు చేస్తున్నాయి. - IIలో

న్యూస్‌రీల్

మాడుగలకు తిరుపతితో విడదీయరాని అనుబంధం



మాడుగల నాగఫణి శర్మ

తిరుపతి సిటీ: పద్మశ్రీ అవార్డుకు ఎంపికైన మాడుగల నాగఫణి శర్మకు తిరుపతితో విడదీయరాని బంధం ఉంది. తిరుపతిలోని ఓరియంటల్ కళాశాలలో ఆయన డిగ్రీ విద్యాభ్యాసం చేశారు. ఆర్‌ఎస్ గార్డన్‌లో ప్రాంతంలో ఉంటూ వారాలబ్బాయిగా జీవనం సాగిస్తూ డిగ్రీ పట్టా పొందారు. రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠంగా పిలవబడే ప్రస్తుత జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో సాహిత్య విభాగంలో పరిశోధక విద్యార్థిగా ప్రొఫెసర్ సన్నిదానం సుదర్శన శర్మ పర్యవేక్షణలో పీహెచ్‌డీ పూర్తిచేశారు. 1990–92 మధ్య కాలంలో టీటీడీ ధర్మప్రచార పరిషత్ అదనపు కార్యదర్శిగా సేవలందించారు.

డిజిటల్ వనరులు వినియోగించుకోండి



మాట్లాడుతున్న డైట్ ప్రిన్సిపల్ శేఖర్

కార్వేటినగరం: ఉపాధ్యాయులు డిజిటల్ వనరులను సమర్థవంతంగా వినియోగించుకుని, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని జిల్లా విద్యాశిక్షణ సంస్థ(డైట్) ప్రిన్సిపల్ డాక్టర్ వి.శేఖర్ అన్నారు. శనివారం డైట్ ఆడిటోరియంలో తరగతిగది బోధనలో డిజిటల్ వనరుల వినియోగం అనే అంశంపై ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ సాంకేతికరంగం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రస్తుత తరుణంలో కృత్రిమ మేధ వంటి నూతన సాంకేతికతను ఉపాధ్యాయులు అందిపుచ్చుకుని, తమ తరగతి గదిలో బోధనను మెరుగు పరుచుకోవాలని సూచించారు. శిక్షణా సంచాలకులు అలాగే డైట్ అధ్యాపకులు బి.చెంగల్ రాజు మాట్లాడుతూ కృత్రిమ మేధ అంశంపై ఉపాధ్యాయులకు ఇలాంటి శిక్షణ కార్యక్రమం గతంలో ఎప్పుడూ నిర్వహించలేదన్నారు. నీలకంఠయ్య, మనోహర్, కల్పన, శశిరేఖ రిసోర్సు పర్సన్లుగా వ్యవహరించారు.

ఏడీఆర్ చెల్లించకుంటే నోటీసులు ఖాయం



సత్యనారాయణ

చిత్తూరు కలెక్టరేట్ : అడ్వాన్స్ డెడ్ రెంట్ (ఏడీఆర్) చెల్లించకుంటే నోటీసులు ఖాయమని జిల్లా గనులు, భూగర్భశాఖ (మైన్స్) డీడీ సత్యనారాయణ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని క్వారీ యజమానులు కచ్చితంగా ఏడీఆర్ చెల్లించాల్సిందేనని స్పష్టం చేశారు. 2024–25 వ ఆర్థిక సంవత్సరానికిగాను ప్రభుత్వం రూ.135 కోట్లు టార్గెట్ విధించినట్లు చెప్పారు. కాగా ఇప్పటి వరకు రూ.87.45 కోట్లు వసూలు చేశామన్నారు. జిల్లాలో బ్లాక్ గ్రానైట్, కలర్ గ్రానైట్, మెటల్ బిల్డింగ్ స్టోన్ గ్రావెల్ వంటివి 423 పరిశ్రమలకుగాను ప్రస్తుతం 217 పనిచేస్తున్నాయన్నారు. ఇప్పటివరకు ఏడీఆర్ చెల్లించినవారు ఈ నెలాఖరులోపు చెల్లించాలన్నారు. లేనిపక్షంలో ఫిబ్రవరి మొదటి వారంలో నోటీసులు ఇస్తామన్నారు. ఫిబ్రవరి 28వ తేదీ లోపు కట్టని వారికి అపరాధ రుసుముతో మార్చి 15 వరకు గడువు ఉంటుందని చెప్పారు. మార్చి నెల తర్వాత కట్టని వారి క్వారీ లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. కాగా జిల్లా నెల వారీ ఫండ్ (డీఎంఎఫ్) లో గత ఏడాది జూన్ వరకు వసూలైన రూ.62 కోట్లు సర్దుబాటు చేయాల్సి ఉందని, ఆ ప్రక్రియ పూర్తయితే వార్షిక లక్ష్యం పెరుగుతుందని డీడీ వెల్లడించారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న ఉద్యానశాఖాధికారి

వి.కోట: మామిడి సాగులో రైతులు సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడులను పొందవచ్చని జిల్లా ఉద్యానశాఖాధికారి మధుసూదన్ రెడ్డి సూచించారు. శనివారం పట్టణంలోని వెలుగు కార్యాలయంలో ఉద్యానశాఖ ఆధ్వర్యంలో మామిడిలో సస్యరక్షణపై రైతులకు శిక్షణ నిర్వహించారు. జిల్లా ఉద్యాన శాఖాధికారి మాట్లాడుతూ మామిడి పూత అంతా ఒకేసారి రావడానికి పొటాషియం నైట్రేట్ 10 గ్రాములు, అర్కా మాంగో స్పెషల్ 5గ్రాములు లీటర్ నీ టికి కలిపి పిచికారీ చేయాలన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ అధికారుల సూచనలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం రైతులకు కరపత్రాలు పంపిణీ చేశారు. రామచంద్రనాయుడు, రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పరిహారం.. రిక్తహస్తం!



గంగాధరనెల్లూరు మండలంలో నేలకొరిగిన వరి పంట

స్వేదాన్ని చిందించి.. ఆరుగాలం శ్రమించి.. పంటలు సాగు చేసిన పుడమి పుత్రులకు పెద్ద కష్టమొచ్చింది. అతివృష్టి, అనావృష్టితో అన్నదాత అల్లాడుతున్నాడు. సాగుకు అప్పు చేశాడు. దిగుబడి చేతికందక దిక్కుతోచని స్థితిలో ఉన్నాడు. అప్పు తీర్చే దారిలేక కుంగిపోతున్నాడు. చేయూత నివ్వాల్సిన కూటమి సర్కారు సాయం అందించడంలో జాప్యం చేస్తోంది. ఓ వైపు రబీ సీజన్ మొదలవుతోంది.. సాగుకు అప్పు పుట్టక..హలం పట్టలేక.. కునారిల్లుతున్నాడు. అయినా ప్రభుత్వం పరిహారం అందుతుందా? లేక రిక్తహస్తం మిగులుతుందోనని ఆవేదన చెందుతున్నాడు. ఇదీ జిల్లాలో కర్షకుల పరిస్థితి.

- ఆరు నెలల్లో పంటలపై ప్రకృతి విలయం
- దెబ్బతిన్న పంటలు
- అదునుకు వర్షాలు లేక వేరుశనగ నేలమట్టం
- తుపానులతో వరికి ఉరి
- అందని పరిహారం
- ఎదురుచూపుల్లో రైతులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): ప్రకృతి ప్రకోపంతో రైతన్న కుదేలయ్యాడు. సకాలంలో వర్షాలు లేక వేరుశనగ చేతికందకుండాపోయింది. అకాల వర్షాలతో వరి..ఇతర పంటలు నేలమట్టమయ్యాయి. దెబ్బతిన్న ఆ పంటలకు సంబంధించి అధికారులు నష్టం అంచనా వేసి ఆ వివరాలను ప్రభుత్వానికి నివేదికలు సమర్పించారు. అయినా నష్ట పరిహారం అందనంటోంది. రైతులు సాయం కోసం ఎదురు చూస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పరిహారం విషయంలో పట్టీపట్టనట్టు వ్యవహరిస్తోందని రైతులు మండిపడుతున్నారు.

కన్నీరు మిగిల్చిన ఖరీఫ్

గత ఖరీఫ్ సీజన్ కర్షకులకు కన్నీరు మిగిల్చింది. తొలుత సకాలంలో వర్షాలు కురక పంట ఎండిపోయింది. ఆ తరువాత వచ్చిన తుపాన్ల కారణంగా బోర్లు, జలవనరుల కింద సాగు చేసిన పంటలు దెబ్బతినడంతో రైతులు పెద్ద మొత్తంలో నష్టపోయారు. గతేడాది ఖరీఫ్‌లో వేరుశనగ సాధారణ విస్తీర్ణం 43,174 హెక్టార్లుగా కాగా 13,044 హెక్టార్లల్లో పంట సాగైంది. అయితే వర్షం కురకపోవడంతో పంట పూర్తిగా దెబ్బతింది. చివరకు చెట్టుకు రెండు కాయలు, తీగలు చేతికి రాలేదు. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఎదురైతే 9 వేల హెక్టార్లల్లో మాత్రమే పంట దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు గుర్తించారు. 24,342 మంది రైతులకు గాను రూ.15.42 కోట్ల మేర పంట నష్టం జరిగినట్లు ప్రభుత్వానికి నివేదికలు సమర్పించారు. ఈ మేరకు ప్రభుత్వం గుడిపాల, పెనుమూరు, యాదమరి మండలాలను అత్యంత కరువు మండలాలుగా ప్రకటించింది. శ్రీరంగరాజుపురం, చిత్తూరు, శాంతిపురం, రొంపిచెర్ల, పుంగనూరు, పలమనేరు, బైరెడ్డిపల్లి, వీ.కోట, గుడుపల్లె, కుప్పం, రామకుప్పం మండలాలను మధ్యస్థ కరువు మండలాలుగా ప్రకటించింది. ఈనేపథ్యంలో పది రోజులకు క్రితం కేంద్ర బృందం కూడా యాదమరి, గుడిపాల మండలాలను సందర్శించి ఖరీఫ్‌లో నష్టపోయిన రైతులతో ముఖాముఖి నిర్వహించింది. అలాగే మిగిలిన మండలాల్లో కూడా వేరుశనగ సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. వారికి కూడా నష్ట పరిహారం చెల్లించేలా అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.



- ఈ చిత్రంలో నేలమట్టమైన వరి పంట చిత్తూరు మండలం పచ్చన పల్లి గ్రామంలోనిది. గతేడాది శేఖర్ అనే రైతు నాలుగు ఎకరాల్లో వరి సాగు చేశారు. రూ.1.50 లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. గత అక్టోబర్‌లో కురిసిన భారీ వర్షానికి పంట నేలమట్టం అయ్యింది. దెబ్బతిన్న ఈ పంటను అధికారులు కూడా అంచనా వేసి ఫొటోలు తీసుకెళ్లారు. కానీ ఇంతవరకు పంట పరిహారం దక్కలేదని రైతు వాపోతున్నారు.

తుపాను తెచ్చిన తంటా

వర్షాలు అదునుకు కురవగా ఖరీఫ్ రైతుల కొంప ముంచింది. ప్రధానంగా వేరుశనగ పంటను తీవ్రంగా నష్టపరిచింది. తీరా భారీ వర్షాల కారణంగా పలు రకాల పంటలు దెబ్బతిని రైతులు నష్టపోయారు. వ్యవసాయ శాఖ అధికారులు, సచివాలయ సిబ్బంది కలసి రెండు విడతలుగా జరిగిన నష్టాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి గుర్తించారు. పుంగనూరు, పలమనేరు, పూతలపట్టు, చిత్తూరు, జీడీనెల్లూరు తదితర నియోజకవర్గాల్లో పంటలు భారీగా దెబ్బతిన్నాయని గుర్తించి, ఫొటోలతో నష్టాన్ని గణాంకాలతో సహా జిల్లా అధికారులకు తెలియజేశారు. ఈ లెక్కన్న జిల్లా వ్యాప్తంగా 1,479 మంది రైతులకు గాను 529.517 హెక్టార్లల్లో వరి పంట దెబ్బతిన్నట్లు నివేదించారు. ఇందుకు గాను హెక్టారుకు రూ.17 వేల చొప్పున్న రూ.90.05 లక్షల నష్టం జరిగినట్లు వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. అలాగే ఉద్యాన శాఖ పరిధిలో మిరప సాగు 24.50 హెక్టార్లు, టమాట 12.75 హెక్టార్లు, కాలీఫ్లవర్ 0.20 హెక్టార్లు, కాకరకాయ 0.82 హెక్టార్లు, తమలపాకు 0.75 హెక్టార్లు, సొరకాయ 1.50 హెక్టార్లతో పాటు మరిన్ని పంటలు కూడా తీవ్రంగా నష్టపోయినట్లు నిర్ధారించినట్లు అందులో పేర్కొన్నారు.

ఖరీఫ్ వివరాలివీ

వేరుశనగ సాగు విస్తీర్ణం	13,044
హెక్టారు సాగుకు ఖర్చు	సుమారు రూ.40 వేలు
వేరుశనగ రైతులకు నష్టం	సుమారు రూ.52.17 కోట్లు
వరి సాగు విస్తీర్ణం	11వేల హెక్టార్లు
హెక్టారుకు సాగు ఖర్చు	సుమారు రూ.60 వేలు
పంట నష్టం	సుమారు రూ.66 కోట్లు

అధికారుల వేసిన అంచనా వివరాలివీ..

వేరుశనగ పంట నష్టం అంచనా	9 వేల హెక్టార్లు
నష్టపోయిన రైతుల సంఖ్య	24,342
నష్టం విలువ	రూ.15.42కోట్లు
తుపాన్‌కు వరి పంట నష్టం	523.517 హెక్టార్లు
వరి సాగుకు ఖర్చు	రూ.17 వేలుగా నిర్ధారణ
మొత్తం నష్టం	రూ.90.05 లక్షలుగా నిర్ధారణ
అత్యంత కరువు మండలాలు	3
మధ్యస్థ కరువు మండలాలు	13

పంట మొత్తం పోయింది...



మాది గంగాధర నెల్లూరులోని అక్కన్న గారిపల్లి. వ్యవసాయం చేసుకుని జీవిస్తుంటాం. జూన్‌లో వరి పంట సాగు చేశాం. ఎకరాలో పంట సాగు చేస్తే రూ.30 వేల వరకు ఖర్చు అయింది. నవంబర్‌లో కోత కోద్దామని అనుకుంటున్నాం. ఇంతలో తుపాను వచ్చి పంట మొత్తం దెబ్బతింది. నేలవాలిన పంట మొత్తం మొలకలొచ్చి ఏం చేయలేకపోయాం. ఫొటోతో సరిపెట్టకుండా పరిహారం ఇస్తే మేలు.

– బాబు, రైతు, గంగాధరనెల్లూరు

రైతులను ఆర్థికంగా ఆదుకోవాలి



రెండు ఎకరాలో వరి సాగు చేస్తే పంట మొత్తం వర్షార్పణం అయింది. మేము సేద్యాన్నే నమ్ముకునే జీవించే వాళ్లం. అనావృష్టి, అతివృష్టితో పంటలు దెబ్బతింటున్నాయి. వ్యవసాయం చేయాలంటేనే భయం వేస్తోంది. ఇప్పుడు రైతులు అడిగితే అప్పులు ఇచ్చేవారు కూడా లేరు. ప్రభుత్వం రైతులను ఆర్థికంగా ఆదుకోవాలి. పంట నష్ట పరిహారం చెల్లించడంతోపాటు అన్నదాత సుఖీభవ రూ. 20వేలు ఇవ్వాలి.

– జయరామయ్య, రైతు, శ్రీరంగరాజుపురం

పరిహారం ఏదీ

ఖరీఫ్‌లో వేరుశనగ పంట తీవ్రంగా నష్టపోయిన ఇంతవరకు పరిహారం అందని పరిస్థితి. ఇదే మాదిరిగానే తుపాను, వర్షాలకు దెబ్బతిన్న శాఖల వారీగా పరిహారం కోసం ప్రతిపాదనలు పంపినా ప్రభుత్వం నోరు విప్పడం లేదు. అధికారులకే దీనిపై ఎలాంటి స్పష్టత లేదని తెలుస్తోంది. నెలలు గడుస్తున్న ఖరీఫ్‌లో దెబ్బతిన్న వేరుశనగ, తుపాను ప్రభావంతో నేలమట్టమైన వరి, ఇతర పంటలకు పరిహారం ఇవ్వడం లేదని బాధిత రైతులు మండిపడుతున్నారు. ప్రస్తుతం బోరు, బావుల్లో నీళ్లు పుష్కలంగా ఉన్న వెంటాడుతున్న ఆర్థిక కష్టాలతో సాగుపై దృష్టి పెట్టలేకపోతున్నామని రైతులు వాపోతున్నారు. అలాగే అన్నదాత సుఖీభవతో ఆదుకోవాలని, లేకుంటే రైతులకు ఆర్థికంగా ఇబ్బందులు తప్పవని వారు వాపోతున్నారు.

ఎం.కొత్తూరు పాఠశాలలో విచారణ



గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

నగరి: కొందరు విద్యార్థుల దురుసు ప్రవర్తనతో మండలంలోని ఎం.కొత్తూరు పాఠశాలకు గ్రామస్తులు తాళం వేయడం.. ఇలాంటి పాఠశాల మాకొద్దు అంటూ నినదించిన వ్యవహారంపై అధికారులు దృష్టి సారించారు. శనివారం ఆర్డీఓ భవానీశంకరి ఆధ్వర్యంలో ఉమన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ పీడీ, డీవైఈఓ ప్రభాకర్‌రాజు, ఎంఈఓలు శ్రీదేవి, నమశ్శివాయం, ఎక్సైజ్ డీఎస్పీ, సీఐ శ్రీనివాసులు రెడ్డి, లా అండ్ ఆర్డర్ సీఐ మహేశ్వర్, సీడీపీఓ కృష్ణవేణిలతో కూడిన ఒక కమిటీ పాఠశాలలో విచారణ చేపట్టింది. పాఠశాలలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులను విడివిడిగా విచారించి వారి స్టేట్‌మెంట్లను రికార్డు చేసింది. అనంతరం ఆందోళన చేపట్టిన గ్రామస్తులతో ఆర్డీవో మాట్లాడుతూ ఈ వ్యవహారంపై పూర్తిస్థాయిలో విచారణ చేపడుతున్నామని, రెండు రోజుల్లో మార్పు కనిపిస్తుందన్నారు. ప్రవర్తన లోపాలున్న విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇస్తామని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూస్తామన్నారు. శాంతియుత వాతావరణంలో పాఠశాల సక్రమంగా జరిగేలా చూసే బాధ్యత తమదని గ్రామస్తులకు భరోసా ఇచ్చారు. ఎంఈఓలు తరచూ పాఠశాలను తనిఖీ చేస్తారన్నారు. విద్యార్థుల్లో దురుసు ప్రవర్తనలో మార్పు వచ్చేలా పోలీసు అధికారులు పాఠశాలకు నిర్ణీత సమయాల్లో విచ్చేసి విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇస్తారన్నారు.

ఉత్తమ విధులకు పురస్కారాలు



అవార్డు అందుకుంటున్న ఎస్పీ మణికంఠ, కలెక్టరేట్ ఎన్నికల విభాగం టెక్నికల్ ఉద్యోగి ఉమాపతి

చిత్తూరు కలెక్టరేట్ : గత సార్వత్రిక ఎన్నికల్లో ఉత్తమ విధులు నిర్వహించినందుకు గాను ఎస్పీ మణికంఠ చందోలు, కలెక్టరేట్ ఎన్నికల టెక్నికల్ ఉద్యోగి ఉమాపతి అవార్డులు అందుకున్నారు. శనివారం విజయవాడలో నిర్వహించిన 15వ ఓటర్ల దినోత్సవం కార్యక్రమంలో వారు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ చేతుల మీదుగా అవార్డులు స్వీకరించారు. గత సార్వత్రిక ఎన్నికల్లో ఎస్పీ మణికంఠ చందోలు పారదర్శకత, శాంతిభద్రతల విఘాతం కలగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు కృషి చేశారు. సార్వత్రిక ఎన్నికల కసరత్తులో నిబద్ధతో విధులు నిర్వర్తించినందుకు పురస్కారం స్వీకరించడం గర్వంగా ఉందని కలెక్టరేట్ ఎన్నికల విభాగం టెక్నికల్ ఉద్యోగి ఉమాపతి తెలిపారు.

జిల్లాకు ఐసీటీసీ వాహనం



వాహన పత్రాలు అందుకుంటున్న అధికారి

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు జిల్లాకు ఇంటిగ్రేటెడ్ కౌన్సెలింగ్, టెస్టింగ్ సెంటర్ (ఐసీటీసీ) వాహనాన్ని ప్రభుత్వం కేటాయించింది. శనివారం జిల్లా హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నిర్మూలన అధికారి వెంకటప్రసాద్‌కు వాహనాన్ని అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ఈ వాహనం మారుమూల గ్రామాలకు వెళ్లి అక్కడ హెచ్‌ఐవీ టెస్టులు నిర్వహిస్తోంది. పాజిటివ్ వచ్చిన రోగుల వివరాలను గోప్యంగా ఉంచి ఏఆర్టీ కేంద్రాలకు తెలియజేస్తుందన్నారు. ఈ వాహనం ద్వారా రోజుకు 200 మందికి పైగా పరీక్షలు నిర్వహించే సామర్థ్యం ఉందన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

సంప్రదాయ కళాకాంతులు

ప్రపంచీకరణ నేపథ్యం.. అరచేతిలో జగమంతా ప్రత్యక్షం.. ఈ తరుణంలో సంస్కృతి, సంప్రదాయంతోపాటు కళలు కనుమగయ్యాయి. అయితే ఆ సాంకేతిక జగతి నుంచి నేటి తరం మళ్లీ సంప్రదాయ కళలపై ఆసక్తి చూపుతున్నారు. నగర జీవనంతో విసుగెత్తిన యవతరం పండుగలకు ఇళ్లకు వచ్చిన సమయంలో సంప్రదాయకళలను ప్రోత్సహించేలా పౌరాణిక, సాంఘిక నాటకాలతోపాటు హరికథల ప్రదర్శనకు ప్రాముఖ్యత నిస్తున్నారు. దీంతో సంప్రదాయ కళలకు మళ్లీ కాంతులు వచ్చాయి.



మొరవిండ్లు గ్రామంలో చిన్నమ్మకథ సాంఘిక నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు(ఫైల్)

సంప్రదాయ కళలకు పూర్వవైభవం

- గ్రామాల్లో నాటకాలు, హరికథలకు ఆదరణ
- కళలను ప్రోత్సహిస్తున్న నేటితరం యువత
- పండుగలకు పల్లెల్లో నాటక ప్రదర్శనలు

పలమనేరు: నాడు ఆబాలగోపాలాన్ని అలరించిన సంప్రదాయ కళలు మళ్లీ పూర్వ వైభవం సంతరించుకుంటున్నాయి. ప్రపంచీకరణ పుణ్యామని సంప్రదాయ కళలు దీనావస్థకు చేరుకున్నాయి. అయితే సమాజంలో వచ్చిన మార్పుల కారణంగా సోషల్ మీడియాతో మళ్లీ పౌరాణిక కళలకు ఆదరణ లభిస్తోంది. గత కొన్నాళ్లగా జిల్లాలోని పడమటి మండలాల్లో పండుగలు, పబ్బాలు, శుభ కార్యక్రమాలకు నాటకాలు, హరికథలు జోరందుకున్నాయి. ఈ వృత్తులనే నమ్ముకున్న ఎందరో కళాకారులు మళ్లీ ఇప్పుడు జనాన్ని రంజింపజేస్తున్నారు.



ఓ సాంఘిక నాటకంలో దుర్యోధనుడి పాత్రధారి (ఫైల్)



హరికథ చెబుతున్న శివాడి సిస్టర్స్ (ఫైల్)

సాంకేతిక యుగం.. సంప్రదాయం ఉష్

గతంలో పౌరాణిక, సాంఘిక నాటకాలు, మన తండ్రుల కాలంలో హరికథలు, బుర్రకథలు, రీల్ సినిమాలకు ఆదరణ ఉండేది. స్మార్ట్‌ఫోన్ల దెబ్బకు సినిమాహాళ్లు కనుమరుగయ్యాయి. ఇంటర్నెట్‌లతో నేటి సమాజం కాలం గడుపుతోంది. దీంతో కళాకారులను పట్టించుకునేవారు కరువయ్యారు.

మళ్లీ మొదలైన ఆదరణ

నేటి ట్రెండ్స్‌ను పక్కనబెట్టి యువత మళ్లీ సంప్రదాయాల్లో భాగమైన జానపదాలు, పౌరాణికాలు, హరికథల వైపు మొగ్గు చూపుతున్నారు. ఇటీవల కాలంలో సోషల్ మీడియాలో ఫేస్‌బుక్, ఇన్‌స్టాల్లో ఎక్కువగా నాటకాలు, కళాకారులు, హరికథల్లోని కొన్ని విపరీతంగా ట్రోల్ అవుతున్నాయి. ఈ ప్రదర్శనలు చూసి గ్రామాల్లోని యువకులు తమ గ్రామాల్లో ఏదేని ఉత్సవాలు, పండుగలు, దశదిన కర్మలకు ఎక్కువగా నాటకాలు, హరికథలను చెప్పిస్తున్నారు.

కళలకు ప్రాశస్త్యం పడమటి గడ్డ

తోలుబొమ్మలాట, వీధి నాటకాలు, పండరి భజనలు, హరికథలు, బుర్రకథలు, కోలాటాలు, చక్క భజనలు, లంబాడీ నృత్యాలు, డప్పు నృత్యాలు, గంగిరెద్దులాటలు, ఇంద్రజాల ప్రదర్శనలు, గొబ్బిళ్ల పాటలు తదితర సంప్రదాయ కళలు ఈ ప్రాంతంలోని జీవనంలో ఓ భాగంలో వస్తున్నాయి. ఇలాంటి కళలు పలమనేరు, కుప్పం, పుంగనూరు ప్రాంతాల్లో ఒకప్పుడు చాలా ప్రాశస్త్యం పొందినవి. సినిమాలు రాకముందు వీటిని అందరూ మక్కువగా చూసేవారు.


హరికథలకు కేరాఫ్ శివాడి సిస్టర్స్

ఇక హరికథల విషయానికొస్తే పెద్దపంజాణి మండలంలోని శివాడి సిస్టర్ కేరాఫ్‌గా చెప్పుకోవచ్చు. ఇక్కడ పదుల సంఖ్యలో హరికథ దాసులు, తబలా, హార్మోనియం వాయించే కళాకారులున్నారు. వీరు కళలను ప్రదర్శించడమే కాకుండా భవిష్యత్తు తరాలకు వీటిని ఇప్పటికీ నేర్పుతున్నారు. పురుషులే కాక మహిళలు కూడా తమ నైపుణ్యంతో కథలు చెబుతున్నారు.

మారిన ట్రెండ్

సినిమాలు రావడంతో ట్రెండ్ మారింది. కాలానికి అనుగుణంగా కళాకారులు సైతం సినిమా పాటల నృత్యాలతో అభినయం చేస్తూ రికార్డు డాన్సులతో నాటకాలు వేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక వీధి నాటకాల విషయానికొస్తే వీటి ఉనికి ఈ ప్రాంతాల్లో ఇప్పటికీ సజీవంగానే ఉంది. ఈ ప్రాంతంలోని టి.వడ్డూరు, కాబ్బల్లి, దొడ్డిపల్లి, ఏటిగడ్డిండ్లు, కొత్తఇండ్లు, మేలుమాయి, కీలపట్ల, బైరెడ్డిపల్లి, దేవదొడ్డి ప్రాంతాల్లో ఇప్పటికీ కళాకారులున్నారు. వీరికి నాటకాలు నేరిృంచేందు కుప్పం ప్రాంతంలోని కంగుంది, కెనమాకులపల్లి, రామకుప్పం ప్రాంతాల నుంచి వస్తారు.


నాటకాలకు మళ్లీ ఆదరణ



ఇప్పుడు గ్రామాల్లో నాటకాలు, హరికథలు, పండరిభజనలకు ఆదరణ లభిస్తోంది. కళాకారుడు సంపాదన కోసం పాకులాడరు. కేవలం కళను ప్రదర్శించడమే ముఖ్యంగా భావిస్తాడు. మొన్నటిదాకా కళనే నమ్ముకున్న మా జీవితాలు కష్టమయ్యాయి. ఇప్పుడు చదువుకున్న యూత్ మళ్లీ నాటకాల వైపు మొగ్గు చూపుతుండడంతో కళకు జీవం వచ్చింది.

– చంద్రశేఖర్, హంస అవార్డు గ్రహీత, మర్రిమాకులపల్లె

ఆదరణ దక్కితే సంతోషం..



మళ్లీ ఇన్నాళ్లకు కళాకారులకు ఆదరణ లభిస్తుంది. ఇప్పుడు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు సైతం వారి సొంత గ్రామాలకు వచ్చినప్పుడు పండగలు, పబ్బాలకు నాటకాలు, హరికథలు పెట్టించడం సంతోషం. మన సంస్కృతిలో భాగమైన సంప్రదాయకళలను రక్షించుకోవాల్సిన అవసరం నేటి యువతపై ఉంది. మాలాంటి కళాకారులను కాపాడుకోవాలి.

– నాటకాల నారాయణస్వామి, కళాకారుడు, నూనెవారిపల్లె

ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటే కీలకం

- చిత్తూరు ర్యాలీ, మానవహారం
- పాల్గొన్న జిల్లా జడ్జి భీమారావు, జేసీ విద్యాధరి


మాట్లాడుతున్న జిల్లా జడ్జి భీమారావు


చిత్తూరులో విద్యార్థుల మానవహారం

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటే కీలకమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గాంధీ విగ్రహం వద్ద విద్యార్థులు మానవహారం ఏర్పాటు చేశారు. అనంతరం అక్కడ నుంచి నాగయ్య కళాక్షేత్రం వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని జాయింట్ కలెక్టర్ విద్యాధరి జెండా ఊపి ప్రారంభించారు. నాగయ్యకళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు మాట్లాడుతూ దేశ పౌరులు తమ ఓటు హక్కును పారదర్శకంగా వినియోగించుకోవాలని తెలిపారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు, ఓటుహక్కు రాజ్యాంగం కల్పించిన హక్కు అన్నారు. ప్రతి ఓటరూ తమ విలువైన ఓటును వినియోగించుకునే సమయంలో సరైన అభ్యర్థిని ఎన్నుకోవడం పైనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉంటుందన్నారు. జాయింట్ కలెక్టర్ విద్యాధరి మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి పౌరుడు ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. ట్రైనీ కలెక్టర్ హిమవంశీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జీవితంలో ఓటుహక్కు వినియోగించుకోవడం అదృష్టంగా భావించాలని చెప్పారు. డీఆర్వో మోహన్‌కుమార్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఏర్పాటై ఇప్పటికి 75 సంవత్సరాలు అయ్యాయని తెలిపారు. అనంతరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరితో ఓటు హక్కు ప్రతిజ్ఞ చేయించారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. యువ ఓటర్లకు ఎపిక్ కార్డులను అందజేశారు. సీనియర్ సిటిజన్ ఓటర్లకు దుశ్శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి భరణి, ఏఎస్పీ రాజశేఖర్‌రాజు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ వాసుదేవన్, ఆర్డీఓ శ్రీనివాసులు, జిల్లా ఐకాన్, బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు నాగార్జున, చిత్తూరు అర్బన్, రూరల్, గుడిపాల తహసీల్దార్లు లోకేశ్వరి, కళావతి, చంద్రశేఖర్ రెడ్డి, చిత్తూరు డీవైఈఓ చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

108 వాహనంలో ప్రసవం.. మగ బిడ్డ జననం


తల్లీబిడ్డను ఆస్పత్రికి తీసుకెళుతున్న సిబ్బంది

నగరి : నెలలు నిండిన గర్భిణికి పురిటి నొప్పులు రావడంతో ఆమెను కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా 108 వాహనంలోనే ప్రసవించింది. కుటుంబసభ్యుల కథనం మేరకు.. నింద్ర మండలంలోని కొప్పేడు గ్రామానికి చెందిన జ్యోతిక (23) నిండు గర్భిణి. ఆమెకు శనివారం ఉదయం పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం ఇచ్చారు. సిబ్బంది వచ్చి ఆమెను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలోనే ప్రసవించింది. పండంటి బాబుకు జన్మనిచ్చింది. ఆమెను నగరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారని 108 సిబ్బంది తెలిపారు.

పశుసంవర్ధకశాఖలో ఇద్దరికి ఉత్తమ అవార్డులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): పశువైద్యసేవలు, పథకాల అమలులో మెరుగైన సేవలందించినందుకు జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ ప్రభాకర్, చిత్తూరు డీడీ అబ్దుల్ హరీఫ్‌కు ఉత్తమ సేవ అవార్డు వరించింది. గణతంత్ర దినోతవం సందర్భంగా విజయవాడలోని పశుసంవర్ధక శాఖ కార్యాయలంలో ఈ అవార్డులను ప్రదానం చేయనున్నారు. ఆ శాఖ డైరెక్టర్ దామోదర్ నాయుడు చేతులు మీదుగా అవార్డు అందుకోనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

బెల్టుషాపు నిర్వాహకుల అరెస్టు


పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం

కుప్పంరూరల్: మండలంలోని వెండుగంపల్లి, నడుమూరు వద్ద బెల్టుషాపులు నిర్వహిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసి, వారి నుంచి భారీగా మద్యం స్వాధీనం చేసుకున్నట్లు కుప్పం అర్బన్ సీఐ శంకరయ్య తెలిపారు. వెండుగంపల్లి బెల్టుషాపు నిర్వహిస్తున్న మూర్తి అలియాస్ రెమో వద్ద రూ.14,130 విలువ చేసే మద్యం స్వాధీనం చేసుకుని అతన్ని అరెస్టు చేసినట్లు చెప్పారు. అలాగే నడుమూరు చెక్ సమీపంలో ఓ దుకాణంలో మద్యం విక్రయిస్తున్న శబరీ, బాబును అరెస్టు చేసి వారి నుంచి రూ.58,788 విలువ చేసే మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఆయన చెప్పారు. ఈ సందర్భంగా సీఐ శంకరయ్య మాట్లాడుతూ ఎవరైనా బెల్టుషాపుల్లో మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవని, అలా నిర్వహిస్తే తమ దృష్టికి తేవాలని స్థానికులను కోరారు.

టీడీపీ నేత దౌర్జన్యం

రాతి కూసాలను తొలగింపు


ఫెన్సింగ్ ధ్వంసం చేస్తున్న జేసీబీ

శ్రీరంగరాజపురం: కూటమి నాయకులు దౌర్జన్యం రోజురోజుకు పెరిగిపోతోంది. మండలంలోని పీవీ పురం గ్రామానికి చెందిన నీల పార్వతమ్మ తమ పొలానికి రక్షణగా ఫెన్సింగ్ వేసుకుంది. అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు అప్పలరాజు తన పొలానికి నీటి సరఫరా కోసం పైపులైన్ వేసుకోవడానికి నీల పార్వతమ్మ పొలానికి రక్షణగా నిర్మించుకున్నా ఫెన్సింగ్‌ను ఎమ్మెల్యే థామస్ స్వగ్రామమైన అల్లగుంట గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులను తీసుకువచ్చి ఫెన్సింగ్‌ను ధ్వంసం చేశారు. కూటమి ప్రభుత్వం తమ పొలానికి రక్షణ లేకుండా పోయిందని, ఇంత దౌర్జన్యం చేస్తుంటే తాము ఎలా బతాకాలని బాధితురాలు నీల పార్వతమ్మ ఆవేదన వ్యక్తం చేసింది. సంబంధిత విషయంపై స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని తెలిపింది.

గణతంత్ర ముస్తాబు


కవాతును పరిశీలిస్తున్న ఏఎస్పీ రాజశేఖర్ రాజు

చిత్తూరు అర్బన్: నగరంలో ఆదివారం జరుపుకోనున్న 76వ గణతంత్ర వేడుకలు (రిపబ్లిక్‌డే)కు జిల్లా పోలీసు శిక్షణ కేంద్రాన్ని అందంగా ముస్తాబు చేశారు. జాతీయ పతాక వందనం కోసం స్టేజీ నుంచి వీక్షకులు కూర్చోవడానికి ఏర్పాట్లు, అందమైన రంగవల్లులు, ఎర్రకోట సెట్టింగ్‌లను సిద్ధం చేశారు. ఇక పోలీసుల కవాతు ఎలా నిర్వహించాలో ట్రయల్ కూడా చూశారు. ఉదయం 9 గంటలకు మొదలయ్యే గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ సుమిత్‌కుమార్ జాతీయ పతాక ఆవిష్కరణ చేస్తారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, విధుల్లో ప్రతిభ చూపించిన ఉద్యోగులకు పురస్కారాలు, పలు ప్రభుత్వ శాఖలకు సంబంధించిన శకటాలను ప్రదర్శించనున్నారు.

పుత్తూరులో తుపాకీ కలకలం!


ఫిర్యాదుదారుడు రాజా

పుత్తూరు: చంపుతానంటూ ఓ ఆర్ఎంపీ డాక్టర్ తనకు తుపాకీ చూపి బెదిరించాడంటూ పుత్తూరు మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన పి.రాజా అనే వ్యక్తి శనివారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడు రాజా పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. స్థానిక సెంగుథర్ వీధిలో షణ్ముగ హాస్పిటల్ నడుపుతున్న ఇ.మునిరాజా అలియాస్ చిన్నా అనే ఆర్ఎంపీ డాక్టర్ ఈనెల 23వ తేదీ రాత్రి 8 గంటల సమయంలో రాజాకు ఫోన్‌చేసి పున్నమి హోటల్ వద్దకు రమ్మని పిలిచాడు. అక్కడకు వెళ్లిన రాజాకు డాక్టర్ మునిరాజా భుజానికి తగిలించుకుని ఉన్న బ్యాగులో నుంచి తుపాకీని తీసి 'కాల్చి చంపేస్తాన్‌రా.. ఏమనుకుంటున్నావ్ రా నువ్వు, నీ మామ. ఇదేమైనా డూప్లికేట్ పిస్టోల్ అనుకుంటున్నావా? ఎత్తి చూడు దీని వెయిట్ తెలుస్తుంది' అంటూ బెదిరించాడు. దీంతో అక్కడి నుంచి ఎలాగో రాజా తప్పించుకుని గ్రామానికి చేరి జరిగిన విషయం కుటుంబ సభ్యులకు చెప్పారు. ఈ విషయం గ్రామస్తులందరికీ చెప్పి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మునిరాజ నుంచి తనకు ప్రాణహాని ఉందని, తన కుటుంబాన్ని రక్షించాలని ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీనిపై సీఐ సురేంద్రనాయుడు మాట్లాడుతూ రాజా నుంచి అందిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టామని తెలిపారు.

పంటలపై ఏనుగుల దాడి


మామిడితోటలో ఏనుగులు విరిచేసిన కొమ్మలు

బంగారుపాళెం: మండలంలోని బోడబండ్ల పారెస్టు బీట్ పరిధిలో ఏనుగులు రైతుల పంటలపై దాడి చేస్తున్నాయి. శుక్రవారం రాత్రి బోడబండ్ల, జంబునేరేడుపల్లె, దిగువ ఎద్దులవారిపల్లె గ్రామాల్లో పంటలపై ఏనుగులు దాడి చేసి, ధ్వంసం చేయాలని రైతులు వాపోయారు. సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి ఏనుగులు రైతుల పొలాలపైకి వచ్చాయని అంటున్నారు. బోడబండ్లకు చెందిన రైతు వరి పొలం తొక్కేశాయన్నారు. దిగువ ఎద్దులవారిపల్లెకు చెందిన రమణారెడ్డి, గోవింద స్వామికి చెందిన మామిడితోటల్లో చెట్లకొమ్మలను విరిచేశాయన్నారు. జంబునేరేడుపల్లెలో శంకరయ్యకు చెందిన గడ్డిని ధ్వంసం చేసినట్లు తెలిపారు. అలాగే అరటి, కొబ్బరి చెట్లను విరిచే శాయన్నారు. గత 20 రోజులుగా బోడబండ్ల సమీపంలోని పాతూరుబండ అటవీ ప్రాంతంలో 15 ఏనుగులు మకాం వేశాయని అన్నారు. రాత్రి సమయంలో ఏనుగులు పంటలపై వరుస దాడులు చేస్తూ తీవ్రంగా నష్టాన్ని కలిగిస్తున్నట్లు తెలిపారు. శనివారం ఏనుగుల దాడిలో నష్టపోయిన పంటలను అటవీశాఖ అధికారులు పరిశీలించారు. బాధిత రైతులకు పంట నష్టపరిహారం చెల్లించేందుకు కృషి చేస్తామని బంగారుపాళెం పారెస్ట్ సెక్షన్ అధికారి మోహన్ మురళి తెలిపారు. ఏనుగులు మందను మళ్లించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నా తిరిగి వస్తూనే ఉన్నాయన్నారు. గత 20 రోజులుగా సిబ్బంది, ట్రాకర్లు ఏనుగులను అటవీ ప్రాంతంలోకి మళ్లించే చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

సీనియర్ సిటిజన్లకు సత్కారం



సీనియర్ సిటిజన్ పార్థసారథిని సత్కరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావ్, సీనియర్ సిటిజన్ కేశవులును సత్కరిస్తున్న జేసీ విద్యాధరి, ఎపిక్ కార్డు అందుకుంటున్న విద్యార్థిని

చిత్తూరు కలెక్టరేట్ : ఓటర్ల దినోత్సవం సందర్భంగా నాగయ్యకళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో సీనియర్ సిటిజన్లకు సత్కారం, కొత్త ఓటర్లకు ఎపిక్ కార్డులను అందజేశారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావ్, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, డీఎఫ్ఓ భరణి, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డీఆర్వో మోహన్‌కుమార్ కలసి సీనియర్ సిటిజన్‌లు పార్థసారథి, కేశవులు, శారద, ఖాదర్‌బాషా, ముత్తుకుమరన్‌లను సత్కరించారు. కొత్త ఓటర్లు అఫ్రీన్, శ్యామ్‌కుమరన్, గుణశేఖర్, దుర్గా ప్రశాంత్, శ్యామ్ అరుణ, దినేష్‌కు ఎపిక్ కార్డులను అందజేశారు.

వీఓఏల జీతాలు వెంటనే మంజూరు చేయాలి


పీడీకి వినతిపత్రం ఇస్తున్న ఏపీ వెలుగు యానిమేటర్ ఉద్యోగుల సంఘం నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్ల(వీఓఏ)కు పెండింగ్‌లో ఉన్న ఏడు నెలల జీతాలు వెంటనే మంజూరు చేయాలని ఏపీ వెలుగు యానిమేటర్ ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు డిమాండ్ చేశారు. శనివారం ఆ సంఘ నాయకులు కలెక్టరేట్‌లో డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. పీడీతో ఆ సంఘ నాయకులు మాట్లాడుతూ ఏడు నెలల పెండింగ్ జీతాల మంజూరు కోసం ఈ నెల 27, 28, 29 తేదీల్లో కలెక్టరేట్ వద్ద మౌనదీక్ష చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి శ్రీధర్ మాట్లాడుతూ ఏడు నెలలుగా జీతాలు లేకపోతే వీఓఏలు ఎలా జీవనం కొనసాగించాలని ప్రశ్నించారు. మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టు అక్రమంగా తొలగింపులు ఈ ప్రభుత్వంలో తీవ్రంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి వెల్లడించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

పూతలపట్టు(కాణిపాకం): రోడ్డు దాటుతుండగా ఓ గుర్తు తెలియని వాహనం ఢీకొన్ని యువకుడు మృతి చెందిన ఘటన శనివారం పూతలపట్టులో చోటుచేసుకుంది. వివరాలు ఇలా...మండలంలోని తేనేపల్లి బీదరామిట్టకు చెందిన నవీన్(27) అనే యువకుడు రంగంపేట క్రాస్‌కు కాలినడకన వెళుతున్నాడు. ఈ క్రమంలో వెనుక నుంచి వచ్చిన ఓ గుర్తు తెలియని వాహనం ఆ యువకుడి ఢీకొంది. దీంతో సంఘటన స్థలంలో మృతి చెందాడు. పూతలపట్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్మశాన దారిని ఆక్రమించారని ధర్నా


తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గంగవరం గ్రామస్తులు

గంగవరం: తమ గ్రామ శ్మశానవాటికకు వెళ్లే దారిని ఆక్రమించి, అందులో వెంచర్ వేస్తే తమకు దారెలా అని గంగవరం గ్రామస్తులు శనివారం రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. తమ గ్రామ శ్మశాన దారిని ఆక్రమించడంపై గ్రామస్తులు తమ అభ్యంతరాలు తెలిపారు. గ్రామంలో సంతకాల సేకరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంగవరం ఫ్లెట్లైవర్‌కు సమీపంలోని సర్వే నంబర్ 336, 336(1)లో రహదారి నుంచి సమీపంలోని కుంట వరకూ దారి, వాగు ఉండేది. ఆ దారి మీదుగా శ్మశానవాటికకు ఏళ్లుగా రాకపోకలు సాగిస్తున్నామన్నారు. ఆ దారి ఆక్రమణకు గురై లేఅవుట్ వెంచర్ వెలిసిందన్నారు. తమ సమస్యను పరిష్కరించాలని, లేకుంటే ధర్నా ఉధృతం చేస్తామన్నారు. స్పందించిన రెవెన్యూ సిబ్బంది సర్వేయర్లు కలిసి వెంటనే లేఅవుట్ వద్దకు వెళ్లి సర్వే చేశారు. శ్మశానానికి కచ్చితంగా దారి కల్పిస్తామంటూ గ్రామస్తులకు అధికారులు హామీ ఇచ్చారు.